క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మక్తల్: మండలంలోని గుడిగండ్లకు చెందిన కతల్‌సాబ్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అందజేశారు. ఇతడి ఆరోగ్యం బాగలేక ఆస్పత్రిలో చేరడంతో ఆస్పత్రి ఖర్చులకోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి రూ. 44వేలు మంజూరైనా చెక్కును పార్టీ కార్యాలయంలో శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం



కృష్ణా: మండల తహసీల్దార్‌గా బి వెంకటేష్ బాధ్యతలు చేపట్టడంతో శనివారం కాంగ్రెస్ నాయకులు శంకర్‌రెడ్డి, మహాదేవ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సర్ఫరాజ్, పల్లె సురేష్, ఖాజహుసేన్ సన్మానించారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి మంచి సేవలు అందించాలని కోరారు.

కెనాల్ నీటితో ఊర చెరువు నింపాలి

మరికల్: మండలంలోని అప్పంపల్లి సమీపంలో కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ నుంచి గ్రామ ఊర చెరువును నింపేందుకు ఎమ్మెల్యేతోపాటు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనంత్‌రెడ్డి శనివారం సంయుక్త ప్రకటనలో అన్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి గ్రామం పక్క నుంచి వెళ్తున్న కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ నుంచి ఊర చెరువును నింపేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదిక ద్వారా అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు సన్మానం



మక్తల్: పట్టణంలో బ్రహ్మకుమారి ఆశ్రమంలో శనివారం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గవినోళ్ల రాధమ్మకు శాలువాతో సన్మానం చేశారు. మక్తల్‌లో విశ్వశాంతి దినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెను సన్మానం చేశారు. కార్యక్రమంలో కెనెరా బ్యాంక్ మేనేజర్ శశిభూషణ్, సంతోషి, శేఖర్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

ఆధునిక పరికరాలతో ఎన్నో లాభాలు



కోస్గి రూరల్: వ్యవసాయరంగంలో ఆధునిక పనిముట్లతో ఎన్నో లాభాలు ఉన్నాయని జీవశాస్త్ర ఉపాధ్యాయులు వార్ల మల్లేషం అన్నారు. శనివారం వ్యవసాయరంగంలో ఆధునిక పనిముట్ల పాత్ర.. అనే అంశంపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీల కొరత ఇబ్బందులతోపాటు శ్రమ, పెట్టుబడి తగ్గించడంలో ఆధునిక పనిముట్లు యంత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తు చేశారు. అనంతరం రైతులు వినియోగిస్తున్నా రోటోవెటర్, హార్వెస్టర్ వంటి పరికరాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తిలకించి వివరాలను తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి ఖర్చు తగ్గుదల, సాగువిస్తీర్ణం పెరుగుదల, పనులు వేగంగా పూర్తికావడం వంటి అంశాలను నమోదు చేసుకున్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి..

మరికల్: మండలంలోని కన్మనూర్‌కు వెళ్లే రోడ్డును మరమ్మతు చేయాలని ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ సంఘం నాయకులు బసంత్, కుర్మయ్య, చింతలయ్య, రామకృష్ణ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మరికల్ నుంచి కన్మనూర్ వరకు ఇటుక బట్టీలు ఉండటంతో భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు గుంతలుగా ఏర్పడి పూర్తిగా ధ్వంసమైందన్నారు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ఆత్మకూర్: నవోదయ కేంద్రియ గురుకులంలో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బాలుర ఉన్నతపాఠశాల సెంటర్‌లో 178 మంది విద్యార్థులకు గాను, 150 మంది హాజరైనట్లు ఎంఈఓ కొండాపురం బాలరాజు తెలిపారు. ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు.



నర్సాపూర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం నార్యానాయక్



మాగనూరు మండలం నేరడగంలో..



లక్కర్‌దొడ్డిలో ఇంటింటి సర్వేలో పాల్గొన్న సీఆర్పీ, ఉపాధ్యాయులు

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

ఊట్కూరు: బడిబయటి పిల్లలను బడిలో చేర్పాలని ఎంఈఓ రామచంద్రాచారి కోరారు. శనివారం బండలంలోని చిన్నపొర్లలో బడి బయటి పిల్లల సర్వే చేపట్టారు. 14 నుంచి 18 సంవత్సరాలలోపు నలుగురు పిల్లలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి అనంతరం ఆర్థిక స్థోమత లేనివారు ఓపెన్ ఇంటర్, డిగ్రీలు చదివించాలని కోరారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యనారాయణ, సీఆర్‌పీ రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

కొల్లంపల్లిలో..

నారాయణపేట రూరల్: సమ్మె కారణంగా నిలిచిపోయిన బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే ఇటీవల ప్రారంభమైంది. ఈ మేరకు మండలంలోని కొల్లంపల్లి కాంప్లెక్స్ పరిధిలో శనివారం సీఆర్పీ రవి ప్రకాష్ ఆధ్వర్యంలో లింగంపల్లి, పిల్లిగుంట్ల తండాల్లో ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించారు. 6 నుంచి 14సంవత్సరాల మధ్య ఇద్దరు పిల్లలను గుర్తించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రాజేశ్వరి, నవభారతి, అంగన్‌వాడీ టీచర్లు సత్యమ్మ, సావిత్రమ్మ పాల్గొన్నారు.

లక్కర్‌దొడ్డిలో ..

నర్వ: బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్పీ నర్సింహులు అన్నారు. శనివారం లక్కర్‌దొడ్డిలో బడి బయటి పిల్లల సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా బడి మానేసిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సింగ్ ఇచ్చారు. ఈ సర్వేలో పాఠశాల హెచ్‌ఎం రమేష్ ఉన్నారు.



చిన్నపొర్లలో ఇంటింటి సర్వే చేపడుతున్న అధికారులు

తల్లిదండ్రులు సహకరించాలి..

మాగనూర్: బడి బయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని సీఆర్పీ ఎల్లాగౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నేరడగండొడ్డిలో బడిబయటి పిల్లల సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో చాలామంది పిల్లలు చదువుకు దూరంగా ఉన్నారని, అటువంటి వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు సరైన అవగాహన కల్పించి బడిలో చేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలకార్మికులుగా మారొద్దు..

దామరగిద్ద: బడికి వచ్చే విద్యార్థులు మధ్యలో బడిమాని బాలకార్మికులుగా మారొద్దని నర్సాపూర్ పాఠశాల హెచ్‌ఎం సూర్యానాయక్ అన్నారు. శనివారం సీఆర్‌పీ మహిపాల్ సమక్షంలో నర్సాపూర్ యూపీఎస్ పాఠశాలలో చదుకుంటు బడి మానేసిన విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సీఆర్‌పీ మహిపాల్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న జడ్జిలు

నారాయణ పేట ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సేవా సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును విద్యానాయక్ సీనియర్ సివిల్ జడ్జ్ మరియు లీగల్ సర్వీసెస్ సెక్రటరీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ లీగల్ సర్వీసెస్ పది పథకాల గురించి వివరించారు. వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు, సఖి సెంటర్, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు, న్యాయ, చట్ట పరమైనా రక్షణ, ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి, వాటిని ఎలా అమలు చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. వీటి కోసం 15100 టోల్ ఫ్రీ నంబరును ఉపయోగించాలన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోని చట్ట ప్రకారం నడుచుకోవాలన్నారు. అనంతరం పిల్లల, వృద్ధుల వసతి గృహాలను తనిఖీచేసి ఆయా రిజిస్టర్‌లను పరిశీలించారు. వసతి గృహంలో ఉన్న పిల్లలను తమ సొంత పిల్లలుగా భావించాలని పిల్లలు చదువులతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నాగేశ్వరి, సీనియర్ అడ్వకేట్ నందు నామాజీ, ప్రిన్సిపాల్ శేషమ్మ పాల్గొన్నారు.

ముగిసిన యువజన వారోత్సవాలు

మరికల్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మండలంలోని యువక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన వారోత్సవాల క్రీడలు శనివారం నాటితో ముగిశాయని అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. చివరి రోజు కొనసాగిన వాలీబాల్ ఫైనల్ పోటీలో సరస్వతి డిగ్రీ కళాశాల విజేతగా నిలవగా, రన్నర్‌గా సీఎం రెస్టారెంట్ టీం నిలిచింది. వీరిని యువక మండలి సభ్యులతోపాటు గ్రామ పెద్దలు అభినందించారు. విజేతలకు ఆదివారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బహుమతులు అందజేస్తామన్నారు.



వాలీబాల్ విజేత జట్టును అభినందిస్తున్న సభ్యులు

ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ శివారులో శనివారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. ఈ విషయంపై ఎస్‌ఐ నవీద్ మాట్లాడుతూ పక్కనే ఉన్న రైస్ మిల్లులో పనిచేసే ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై ఉండగా కర్ణాటకలోని వద్దూర్‌కు చెందిన ద్విచక్రవాహన దారుడు వారిని ఢీ కొట్టాడని, వారిని చికిత్స నిమిత్తం రాయచూర్ రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తప్పిదాలు లేకుండా సర్వే నిర్వహించాలి..



దామరగిద్దలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ సీఈఓ



హిందుపూర్‌లో..

దామరగిద్ద: సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ తప్పిదాలు లేకుండా సర్వే నిర్వహించాలని, డిప్యూటీ సీఈఓ జ్యోతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను ఆమె ఆకస్మికంగా పర్యవేక్షించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సేకరించిన భూములు, పొలాల్లో కాల్వలు, చెరువు ప్రాంతం, గుట్టలు సాగుకు యోగ్యం కాని ఇతర భూముల వివరాలు విధిగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఆర్‌ఐ బాల్‌రాజ్, ఏఈఓ శివజ్యోతి, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

వివరాల సేకరణ..

కొత్తపల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మండల తహసీల్దార్ జయరాములు, వ్యవసాయ అధికారి రమేష్, ఏఈఓ ప్రశాంత్ రైతుల పొలాల్లో క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. సీనియర్ అసిస్టెంట్ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

కృష్ణా: మండలంలోని ముడుమాల్, హిందుపూర్ గ్రామాల్లోని రైతు పొలాల్లో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చెట్లు, గుట్టలు, బావులు, చెరువులు, నాల, బీడుభూములను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, ఏఈఓ అభిలాష్, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పరిశీలన

మద్దూరు: మండలంలోని దామ్లతాండా, జాదార్‌పల్లితాండాల్లో శనివారం ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఓ రామన్నలు రేషన్‌కార్డుల పరిశీలన చేపట్టారు. అలాగే గతంలో సర్వే చేసినా ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ర్యాడం చెకప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలానికి మంజూరైనా 844 రేషన్‌కార్డుల్లో లిస్టులో ఉన్న గ్రామంలో అందుబాటులో ఉండాలని వారు సూచించారు.

గురుకుల పరీక్ష వాల్ పోస్టర్ విడుదల



ఊట్కూరు: మండలంలోని గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ వాల్‌పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు హాజరు కావాలని కోరారు. ఐదో తరగతి, 6వ తరగతి, 9వ తరగతి ప్రవేశాలు కోసం ఇప్పటి నుంచే పరీక్షలు రాయాలని కోరారు. 2025–26 విద్యా సంవత్సరం కోసం ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజ్ఞేశ్వర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, కొక్కు శంకర్, ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, షమీర్‌అలీ పాల్గొన్నారు.

ఎంపీడీఓ సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



నారాయణపేట: జిల్లా ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఊట్కూర్ ఎంపీడీఓ ధనుంజయ గౌడ్ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సాయిలక్ష్మి ఎంపీడీఓ దామరగిద్ద, శ్రీనివాస్ ఎంపీడీఓ నర్వ, ప్రధాన కార్యదర్శిగా రమేష్ ఎంపీడీఓ మక్తల్, కోశాధికారిగా శ్రీధర్ ఎంపీడీఓ కోస్గి ఎంపికయ్యారు.

ఉత్సవాలకు వేళాయె..

- 21 నుంచి మన్నీపురం హాజీమాలంగ్ బాబా ఉర్సు
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న నిర్వాహకులు

అమరచింత: ఆహ్లాదకరమైన గుట్టలపై వెలసిన శ్రీసయ్యద్ షా హాజీమాలంగ్ బాబా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు దర్గా పరిసరాలను సుందరీకరణ చేసే పనుల్లో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ఎంతో మహిమలు కలిగిన హాజీమాలంగ్ బాబా దర్గా షరీఫ్‌ను దర్శించుకునేందుకు రాష్ట్ర ప్రజలే కాక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి కందూర్ చేయడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఈనెల 21 నుంచి 23 వరకు మన్నీపురం గుట్టలో వెలసిన శ్రీ సయ్యద్‌షా హజ్రత్ హాజీమలాంగ్ బాబా ఉర్సు ప్రారంభమవుతుందని ముర్షద్ మైనొద్దీన్ తెలిపారు. 21న గంధోత్సవం, 22న ఉర్సు, 23న ఫాతేహా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దర్గా వద్ద నిర్వాహణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

అమరచింత: ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలు జరుగుతున్నాయని, ఆ పార్టీ జిల్లా నాయకులు వెంకటేష్, అజయ్‌లు తెలిపారు. మండల కేంద్రంలోని జీఎస్ స్తూపం వద్ద శనివారం మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం ప్రజల మధ్య ఉంటూ పోరాటాలు చేస్తున్న ఏకైక సీపీఎం అన్నారు. కార్మిక, కర్షకుల సమస్యలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ రమేష్, బుచ్చన్న, శ్యాంసుందర్, కరుణాకర్, వెంకటేష్, విజయ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ రాంచందర్

మక్తల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. శనివారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌ల్లో ఆటో, క్యాబ్, బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ప్రతినెల కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే రివ్యూ మీటింగ్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలతోపాటు చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ప్రయాణికులు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని, సీట్‌బెల్టు, హెల్మెట్ ధరించాలని, నియమిత వేగంతో ప్రయాణించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రాంచందర్, ఆర్టీఓ మేఘ గాంధీ, పోలీసులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



మాగనూర్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ అనిల్‌గౌడ్



కొత్తపలి సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆంజనేయులు

మాగనూర్: మండలంలోని పుంజనూర్, కొల్పూర్, మందిపల్లి, గజరండొడ్డి, అమ్మపల్లి ప్రభుత్వ పాఠశాలలను శనివారం మండల ఇన్‌చార్జి ఎంఈఓ అనిల్‌గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వ బడుల్లోనే సుశిక్షుతులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని ఎంఈఓ ఆంజనేయులు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని విద్యావనరుల కేంద్రంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన విషయంలో నాణ్యమైన భోజనం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్‌ఎంలు వెంకట్ రెడ్డి, ఆంజనేయరెడ్డి, బాలయ్య, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

కోటకొండ మండల ఏర్పాటుకు కృషి



ధర్నాలో మాట్లాడుతున్న శివకుమార్ రెడ్డి

నారాయణపేట రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి నోటితోనే కోటకొండ మండల కేంద్రాన్ని ప్రకటింప చేస్తామని కాంగ్రెస్ మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మండల ఏర్పాటు ధర్నా శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, చిన్న మండలాల ఏర్పాటు ఎంతో అవసరమని, అందుకు తగ్గట్టుగా కోటకొండ మండలాన్ని ప్రకటించి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పాలన సౌకర్యవంతంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాము, కాశీనాథ్, సదాశివరెడ్డి, బండి వేణుగోపాల్, హన్మంతు, రాజేష్, వెంకటేష్ గౌడ్, యాదగిరి, విజయలక్ష్మి, నారాయణ, నరహరి, సాయికుమార్, సలీం పాల్గొన్నారు.

మండలంగా ప్రకటించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. గ్రామ చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ.. కోటకొండను మండలంగా ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాలు, తండాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం స్పందించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకట్ రాములు, నర్సిరెడ్డి, కనకప్ప, చెన్నప్ప యాదవ్, ప్రవీణ్, రాములు, కృష్ణ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



పేటలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

నారాయణ పేట టౌన్/ కోస్గి రూరల్: పేట స్థానిక చౌక్ బజార్‌లో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం పలువురు ఆయన చేసిన సేవలను కొనియాడారు. అలాగే కోస్గి పట్టణంలోని శివాజీ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ నాయకులు గోపాల్ యాదవ్, భీమన్న, కిష్టప్ప, కృష్ణయ్య, రాములు, భోజప్ప తదితరులు పాల్గొన్నారు.

50 పడకల ఆస్పత్రికి ప్రతిపాదనలు

- 21న వైద్యశాఖ మంత్రి రాక
- అభివృద్ధికి కట్టుబడిఉన్నాం
- ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



డీఎంహెచ్‌ఓతో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రి 50 పడకల భవన నిర్మాణానికి అనుమతులు రానున్నాయని, ఈనెల 21 వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్వయంగా ప్రకటించనున్నారని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్‌లతో కలిసి సందర్శించారు. రూ.3.50 కోట్ల నిధులతో ఇక్కడి ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు 21న వైద్యశాఖ మంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. పట్టణ శివారులోని పీజేపీ క్యాంపు వద్ద 50 పడకల నూతన భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించామని, పక్షం రోజుల్లోగా అనుమతులు రానున్నాయన్నారు. నిర్మాణానికి సంబంధించి రూ.18 కోట్లు, మొత్తం రూ.35 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

బహుమతుల ప్రదానం..

ఆత్మకూర్‌లోని బీసీకాలనీలో వారం రోజులుగా సోంసాగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి మొత్తం 29 జట్లు తలపడ్డాయి. మక్తల్ ఎమ్మెల్యే నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి మినీస్టేడియం జట్టుకు రూ.10 వేలు, షీల్డు, రెండో బహుమతి ధర్మఫ్రెండ్స్ జట్టుకు రూ.6 వేలు, షీల్డు అందజేశారు.

డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరిస్తాం..

ఆత్మకూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. కళాశాల ముందు ప్రవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలాన్ని రోడ్డు నిర్మాణం కోసం తీసుకుంటామని, అదనపు తరగతిగదుల నిర్మాణం పూర్తి చేయిస్తామని, ప్రహరీ నిర్మాణం చేయిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, గంగాధర్‌గౌడ్, రామలక్ష్మారెడ్డి, మణివర్ధన్‌రెడ్డి, గడ్డంశ్రీను, నాగేష్, దామోదర్, సాయిరాఘవ, సుదర్శన్‌శెట్టి, తుకారంనాయక్, శంషీర్, గంగ, తదితరులు పాల్గొన్నారు.